# రామపాదసాగర్

ఇద్దరం అలా కళ్ళు అప్పగించి కొన్ని క్షణాలు నిల్చుండిపోయాం!

ఎదురుగుండా ఏనుగు కొండా, కుడిపక్కన పట్టిసీమగుడీ, ఎడమవైపు మహానందేశ్వరుని పర్వతం, పెద్దచాప పరిచినట్టుగా, గలగలా పరుగెత్తుకుపోయే గోదావరీ ఎంతో ఆనందాన్ని స్తున్నాయి.

"అక్కడ సరస్సులో ఇప్పటికీ మొసళ్ళున్నాయట! ఆ ఏనుగుకొండ దగ్గరున్న సరస్సులోనే గజేంద్రమోక్షం జరిగిందట! ఇక్కడికి తామరాకులు ఆ సరస్సునించే వొస్తాయి. మహానందేశ్వరుని కొండమీద ఏదో బిలం ఉందిట. దానిలోంచే పూర్వం మనవాళ్లు కాశీ వెళ్ళేవారుట..."

అల్లాగే పట్టిసీమ గురించికూడా ఉన్న కట్టుకథలన్నీ, కలలోలా చెప్పాను, స్వామికి–వాటిలో నమ్మకంలేని నేను! స్వామికూడా నిర్లక్ష్యంగానే విన్నాడు.

నాకు ఎందుకో 'పడోసీ'జ్ఞాపకానికివొచ్చింది. అందులో నదికి అడ్డకట్టు కట్టడంవల్ల ప్రకృతి సహజసౌందర్యం కుత్రిమ మవుతుందని వాపోతుంది ఒక పాత్ర.

తర్వాత నేను 'మోడల్ డాం' ని అతికించినట్టుగా ఆ దృశ్యాన్ని ఊహించుకునేటప్పటికి ఎక్కువగా పారిశ్రామికాభివృద్ధి వాంఛిస్తూ, నవనాగరీక ప్రపంచంలో నా దేశప్రజలు కూడా నాగరీకులుగా కావాలనీ, ఇప్పటి కుళ్ళూ, మురికీ పోయి శుభ్రమైన, అందమైనజాతి కావాలనీ కోరుకుంటో అల్లాంటి దేశాన్ని చూడ్డంలోనే ఎక్కువ ఆనందాన్ని పొందే వాణ్ణవడంవల్ల, నా మనస్సు అద్భుతమైన సంతోషంతో ఉప్పొంగింది.

కాని ఎక్కడో మూలనించి ప్రకృతిసౌందర్యం కుత్రిమ మవుతుందనే బాధ నా 'ఆర్టిస్టు' భావాన్ని గాయపర్చి మాయమైంది.

'కళ ప్రజల ఆయుధం' అనే హరీంద్రనాధుని వాక్యం, 'కళ కళకోసం' అనే పురాతన భావాన్ని అడుక్కు నెట్టేసింది.

స్వామీ అంతే! తియ్యని తలపుల్తో, మంత్రమగ్ధుడిలా, నిశ్శబ్దాన్ని మోస్తూ చూస్తున్నాడు.

దూరంలో నీటిలోతేలే తెరచాప పడవలూ, రేవుకిపోయి బిందెలతో నీళ్లని తెచ్చుకునే గృహిణీమణులూ, తొండంతో చిచ్చుబుడ్డిలా నీటిని చిమ్మే ఫారెస్టు డిపార్టుమెంటువారి ఏనుగు,

దాని వెనక కేరింతలు కొడుతో, గెంతే చిన్నపిల్లలూ, ఆకాశంలో గూళ్ళకిపోతున్న పక్షి సమూహాలూ, ప్రాజెక్టుపని ముగించుకుని ఇంటికి తిరిగిపోయే కూలీల పాటలకలగలపు ధ్వనులూ మమ్మల్ని మరో లోకంలోకి తీసుకుపోతున్నాయి!!

ఇది పూర్తయ్యేలోపల చుట్టుపక్కలి కొన్ని పర్వతాలు అంతర్ధానమవుతాయి. ఎన్నో ఫ్యాక్టరీలు, ఖార్ఖానాలు తెరుస్తారు. ఊరంతా విద్యుచ్ఛక్తి మయమవుతుంది. విజ్ఞానవంతులై, ఇక్కడ పలువిధాలైన ఉద్యోగాలకువొచ్చే విద్యావంతులతో గొప్ప విజ్ఞానకేంద్ర మవుతుంది."

ఏదో వల్లెవేస్తునట్టు అంటున్నాను. స్వామి మౌనంగా వింటున్నాడు.

నేను ఇంకా అనసాగాను: "డాక్టరు రావుగారు అన్నారుకదా, ఆ ప్రాజెక్టు కట్టడంతో ఈ వూరు గొప్ప క్షేత్రం అవుతుందని, ప్రపంచంలోని వివిధ దేశాలనించి గొప్ప మేధా వంతులూ, ఇతరులూ యాత్రీకులుగా ప్రపంచకంలో 'బేల్డరు డాం' తరువాత 'కపాసిటీ'లో అంత పెద్దదై, రెండోస్థానం ఆక్రమించే ఈ ప్రాజెక్టుని చూడ్డానికి వస్తారనీని"

"ఎవరా రావుగారు?" అన్నాడు స్వామి స్వప్నంలోలా.

"కె. యల్. రావుగారని, తెలుగువాడే! దీనికి ప్రస్తుతం డిజైన్సు ఇంజనీరు, పాశ్చాత్య దేశాల్లో చాలా ఏళ్లు పనిచేసి, అనుభవంపొందిన ఆంధ్ర ఇంజనీరు, టెర్జాగీ, డాక్టర్ సావేజ్ మొదలైన ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఇంజనీర్లకి సన్నిహిత స్నేహితుడు."

కొంచెంసేపు ఊరుకున్నాను. స్వామి కలపని మోసుకుపోతున్న పడవలోని బెస్తగాళ్ల పాటని వింటున్నాడు.

"హైలాసో, హైలాస! హైలాసో వవ్వారి వవ్వ!"

"ఆయన అంత గొప్పవాడు, మళ్లీ ఎవరితోనన్నా మాట్లాడేటప్పుడు, అన్నీ ఎదరివ్యక్తి తెలుసుననుకునేటట్టు, ఏమీ కష్టం లేదనుకునేటట్టు ఫీలయ్యేలా చెబుతాడు. ఎంతో దీక్షతో శొంఠి రామ్మూర్తిగారు ప్రారంభించారు! దీన్ని పూర్తిచేసి, కళ్లారా చూడాలని ఈయన అభిలాష!! దీని విషయంలో అంత పట్టుదలగల మనిషి."

"కాని..." చప్పరించాను.

"కాని? ఏం?" స్వామి ఆతృతతో అడిగాడు.

"దీన్ని సవ్యంగా ఎప్పటికి తీసుకుంటుందా ప్రభుత్వం? అనేది అందరికీ అనుమానమే!"

స్వామికి మనస్సు నీరయినట్టుంది: "ఎందుకు తీసుకోదు?" అన్నాడు నిరుత్సాహాన్ని కప్పిపుస్తూ.

నాకు మధ్యాహ్నం లేబరేటరీలో జరిగిన విషయం గుర్తుకొచ్చింది. స్వామీ, మరికొందరు కాంగ్రెసు పెద్దలూ లేబరేటరీ చూడ్డానికి వచ్చారు. సూపర్‌వైజరూ, ఫిజిసిస్టూ వాళ్ళకి సోయల్ ఎనాలిసిస్ గురించీ, వాటర్ సెడిమెంట్ ఎనాలిసిస్ ద్వారా రిజర్వాయర్ ఆయుష్షు ఎంత ఉండేదీ ఎలా కనిపెడతారో అన్నీ సీరియస్‌గా చెబుతున్నారు.

ఆఫీసర్ దాని పొడవు 6,600 అడుగులుంటుందనీ, రిజర్వాయర్ మొత్తం కపాసిటీ

6,80,000 మిలియనుల ఘనపుటడుగులు ఉంటుందనీ, 1 1/2 లక్షల కిలోవాట్సు విద్యుచ్ఛక్తి సప్లయి అవుతుందనీ, దాదాపు 10 లక్షల టన్నుల ధాన్యం పండుతుందనీ, 23 లక్షల ఎకరాల భూమి కొత్తగా సాగుబడి అవుతుందనీ, కాలవలు విశాఖపట్నం హార్బర్‌కు ఎడమవైపూ, కుడివైపున క్రిష్ణావరకూ దాని అవతల 105 మైళ్లవరకూ వెడతాయనీ, ఇంకా ఎన్నోవిషయాల్ని ఎంతో ఉత్సాహంతో చెప్పసాగాడు.

కాని అందరినీ నిరుత్సాహపరిచిన ఒక విషయం మా దృష్టిని ఆకర్షించింది.

"కాలవలు ఎంత పైనించి, ఎలా వెడతాయండీ?"

ఒక ఖద్దరు వ్యక్తి ఆతృతగా అడిగాడు. తక్కినవాళ్ల ఆశ్చర్యానికి కారణం: ఇంకా పనంటో మొదలుకాలేదు! ప్రభుత్వం జాగుకి కారణం అనూహ్యమవుతోంది. ఆంధ్రరాష్ట్రం వొచ్చేదాకా ఇంతేనా? దేశంలో తగు ప్రచారంచేసి, దీని విషయమై ప్రభుత్వం శ్రద్ధతీసుకునేలా చేసే ఉత్సాహం ఒక్క ఆంధ్రుడికీ లేదే? ఇలాంటి పెద్ద ప్రయత్నంలో పాల్గొనడానికి వుత్సాహ పూరితులై, ముందుకు వొస్తున్న వృద్ధ అమెరికన్ ఇంజనీర్ల సహాయం ఎంత తొరగా మనం పొందగలుగుతే అంత మంచిదికదా? ఇది ఒక్క ఈవూరి ప్రజలకోసమేమో అనుకున్నట్టు తక్కిన ఆంధ్రలోకమంతా నిద్రపోతే, దేశానికి తగిన తిండినీ, పెద్ద పరిశ్రమలనూ ఇచ్చే ఇది ఎంతవరకూ కొనసాగను? ప్రజల్లో ఆందోళనలేందే ఏ ప్రభుత్వమన్నా ఏ పనైనా జాగుచెయ్యకుండా చెయ్యడం ఎక్కడైనా వుందా? ఎన్నో ప్రశ్నలు!! అందరి మెదళ్లకి పని కల్పించాయి!

"కాలవల గొడవ అక్కడ తెల్సుకోండి" నిరుత్సాహంతో సూపర్‌వైజర్ జవాబిచ్చాడు. కొందరు అటు వెళ్లారు. తక్కినవాళ్ళకి వచ్చిన ఉత్సాహంతో ఫిజిసిస్టు అన్నీ చెప్పాడు.

"మధ్యాహ్నం నేను అసలైన ఆంధ్రుణ్ణి చూశాను. అతనికి తక్కిన గొడవలు ఏమీ అక్కర్లేదు! కాలవలు ఎలా వెడతాయో, తనపొలాలు బాగుపడతాయో లేదో, తనకి రాబడి కొత్తగా ఎంతవొస్తుందో, కాలవలువెళ్లే దారిలో చవగ్గా పొలాలు ఇప్పుడే కొనుక్కుంటే ఎంత లాభం వస్తుందో అదే అతనికి కావాలి! ఆంధ్రత్వం అల్లాగే ఉండాలి. ఆంధ్రుణ్ణయినందుకు నవ్వాలో, ఏడ్వాలో నాకు తెలీటంలేదు. తెలివిలో, సంస్కారంలో, జాతీయతలో, విజ్ఞానంలో అన్ని రంగాల్లోనూ గొప్పవాళ్ళయికూడా అడుగునపడి వుండే దురదృష్ట జాతి గావును మనది. ఒకవిధంగా మనం అంధులం-ఆంధ్రులం కాం!"

కోపంతో, చెప్పలేని బాధతో కళ్లనీళ్లు తిరిగాయి. ఇంక మాటలాడలేకపోయాను.

స్వామి సానుభూతి చూపుతున్నట్టు నిట్టూర్చాడు.

తరువాత ఇంటికి పోడానికని లేచాం. గట్టుమీది జనం, ఇంకా పూర్తిగా పోని అస్తమిస్తున్న సూర్యుని అరుణకాంతిలో 'సిల్హౌటీగా' కనపడుతున్నారు. తూర్పువైపునుంచి చీకటి లోకాని కప్పుతోంది.

*12.09.1948–ఆనందవాణి వారపత్రిక*